# మత్స్యకారులకు ప్రోత్సాహం


కడెం మండలకేంద్రంలో చేపలు పడుతున్న సిబ్బంది(ఫైల్)


చేప పిల్లలను సొసైటీ సభ్యులకు పంపిణీ చేస్తున్న అధికారులు (ఫైల్)

- **కడెం మత్స్యాభివృద్ధి కార్యాలయం నుంచి పంపిణీ**
- **ఇప్పటివరకు 2.36 వేల చేప పిల్లల అందజేత**

కడెం, అక్టోబర్ 13: మత్స్యకారుల జీవితాల్లో మరిన్ని వెలుగులు నింపాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం యేటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుంది. 2016 నుంచి ఇప్పటివరకు వందశాతం రాయితీపై చేప పిల్లలను అందిస్తూ వారి వృత్తిని మరింత ప్రోత్సహిస్తున్నది. కడెం మండలకేంద్రంలో మత్స్యాభివృద్ధి కార్యాలయం నుంచి నిర్మల్ జిల్లాలోని పలు పలు మండలాలు, గ్రామాలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఎఫ్‌డీవో సుమలత ఆధ్వర్యంలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయితే కడెం మండలకేంద్రంలోని ప్రాజెక్టు సమీపాన ఉన్న ఈ కార్యాలయం 15 ఎకరాల్లో ఉంది. ఇందులోనే బిడ్స్ ఏర్పాటు చేసి వాటిలో పిల్లలను పెంచుతారు. అయితే ఇవి 2.5 మిల్లీమీటర్ల సైజ్‌కు రాగానే సొసైటీ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన చెరువులు, కుంటలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు ఖానాపూర్, నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల పరిధిలోని ఆయా గ్రామాలకు పంపిణీ చేశారు. అవసరమైన చెరువులకు సొసైటీ సభ్యులు ఇక్కడికి వచ్చి వారి చెరువు డిమాండ్‌కు తగినన్ని అందించాలని కోరితే ఇస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే ఇక్కడి నుంచి 2.36 వేల రాహు, బొచ్చే రకాలకు చెందిన చేప పిల్లలను అందించారు. అయితే ఈ మూడు నియోజకవర్గాల్లో ఇప్పటివరకు అందించిన పిల్లలతో పాటు, అవసరమైన సొసైటీ సభ్యులు కడెం మత్స్యాభివృద్ధి సంస్థ కార్యాలయానికి వచ్చి వారి అవసరం మేరకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. యేటా సర్కారు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయడం వల్ల ఉత్పత్తి పెరిగి, మత్స్యకారులు మంచి లాభాలు పొందుతున్నారు. ఇక్కడ అవసరమైన డిమాండ్‌కు విక్రయించడంతో పాటు, అనంతరం ఇక్కడి చేపలను మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ, డిల్లీ, పశ్చిమబెంగాల్, చత్తీస్‌గఢ్, అసోం వంటి రాష్ట్రాలకు చేపలను తరలిస్తూ లాభాలు గడిస్తున్నారు. మత్స్య సంపద వృద్ధిలో దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తయారైంది. నీటి వనరులు పుష్కలంగా పెరిగి కుంటలు, చెరువుల్లో ఏడాది పొడవున నీళ్లు అందుబాటులో ఉండడంతో మత్స్యకారులకు ఏడాది పాటు మెరుగైన ఉపాధి దొరుకుతుంది. దీనికి తోడు ప్రభుత్వమే ఉచితంగా చేప పిల్లల పంపిణీతో పాటు, రుణాలు, మార్కెటింగ్ సదుపాయం, సమీకృత చేపల మార్కెట్, బీమా, ప్రత్యేక వాహనాలు, శిక్షణ ప్రోత్సాహంతో వారి కుటుంబాల్లో మరింత వెలుగులు నిండుతున్నాయి.

### సొసైటీ సభ్యులకు నేరుగా పంపిణీ ..

ఖానాపూర్, నిర్మల్, ముథోల్ నియోజకవర్గాలోని ఇప్పటికే 2.36 వేల చేప పిల్లలను ఆయా చెరువుల్లో పంపిణీ చేసినం. అయితే ఈ ఏడాది వర్షాల ఆలస్యం కారణంగా పిల్లల పెంపకం ఆలస్యం అయ్యింది. దీంతో పంపిణీ కాస్తా ఆలస్యమైనప్పటికీ అవసరమైన అన్ని సొసైటీలకు పంపిణీ చేశాం. ఇంకా అవసరమైన వారికి కూడ పంపిణీ చేస్తాం. దరఖాస్తు చేసుకున్న వారు వాహనంతో కార్యాలయానికి వస్తే అందిస్తాం.

**-సుమలత, ఎఫ్‌డీవో కడెం**

# చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు


ఖానాపూర్‌లో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు

ఖానాపూర్, అక్టోబర్ 13: ఖానాపూర్ మున్సిపాలిటీలో రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పట్టణంలోని విద్యానగర్‌లో సెంటర్ డివైడర్ నుంచి 20 ఫీట్లలోపు ఉన్న పాత రోడ్డును పొక్లెయిన్‌తో శుక్రవారం తొలగించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యను తొలగించే లక్ష్యంతో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్ పర్యవేక్షణ లో సాయిబాబా ఆలయం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. రెండు వైపులా సెంటర్ డివైడర్ నుంచి 55 ఫీట్ల వెడల్పుతో రోడ్డు విస్తరణ, అదేవిధంగా రోడ్ల కిరువైపులా అండర్ డ్రైనేజీ పనులు సైతం కొనసాగుతున్నాయి. ఫోర్‌లేన్ నిర్మాణం పూర్తయితే ఖానాపూర్ రూపు రేఖలు మారిపోతాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ ప్రజలు, వ్యాపారులు రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని మున్సిపల్ అధికారులు కోరుతున్నారు.


రికార్డును పరిశీలిస్తున్న ఎంపీవో ఉపేందర్

# నచ్చన్‌ఎల్లాపూర్‌లో ఎంపీవో పర్యటన

కడెం, అక్టోబర్ 13: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఎంపీవో ఉపేందర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జనన, మరణ రికార్డులతో పాటు, ఇంటి పన్ను, వివాహ నమోదు, గ్రామ సభల రికార్డులు, అలాగే పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి రమాదేవికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు గంగన్న, కారోబార్ మహేందర్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి


పరీక్షలు చేస్తున్న హెచ్‌ఈవో వేణు గోపాల్

దస్తురాబాద్, అక్టోబర్ 13 : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పీహెచ్‌సీ హెచ్‌ఈవో వేణుగోపాల్ పేర్కొన్నారు. మండలంలోని మున్యాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా 46 మందిని పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే సీజనల్ వ్యాధులు, ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ఏపీఎం గంగాధర్, హెచ్‌వో లలిత, హెల్త్ అసిస్టెంట్ రాజేశ్వర్, ఏఎన్‌ఎం సాయవ్వ, ఆశ కార్యకర్త అనసూయ పాల్గొన్నారు.

## డీటీఎఫ్ పోస్టర్ విడుదల

ఉట్నూర్, అక్టోబర్13 : డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఈనెల 15,16,17 తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించనున్న ఐదోరాష్ట్ర విద్యా వైజ్ఞానిక రజతోత్సవ మహాసభల పోస్టర్‌ను ఆ సంఘం రాష్ట్ర నాయకుడు ముడుగు సామ్యూల్ శుక్రవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో విడుదల చేశారు. నాయకులు రవిత, అశ్విని, వీరయ్య, మెస్రం దేవ్‌రావ్, గజానంద్ పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

ముథోల్, అక్టోబర్ 13 : మండలకేంద్రంతో పాటు ఎడ్‌బీడ్, కారేగాం గ్రామాల్లో 21 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ సాయి కిరణ్ తెలిపారు. వారి నుంచి రూ. 46 వేలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## వాహనాల తనిఖీ

ఖానాపూర్ రూరల్, అక్టోబర్ 13 : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ లింబాద్రి అన్నారు. మండలంలోని బాదన్‌కుర్తి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. రూ. 50 వేలకు మించి డబ్బులు వెంట తీసుకెళ్లవద్దని, తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకెళ్లాల్సి వస్తే రసీదులు ఖచ్చితంగా దగ్గర ఉంచుకోవాలని ఆయన సూచించారు.


కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

# కడెం వరద గేట్‌కు మరమ్మతు


ప్రాజెక్టు గేట్ వద్ద మరమ్మతు చేస్తున్న సిబ్బంది

కడెం, అక్టోబర్ 13: కడెం ప్రాజెక్టు 15వ వరద గేట్ కౌంటర్ వెయిట్ ఇటీవల తెగిపోయిన విషయం తెలిసిందే. అయితే ఈ గేట్ నుంచి దిగువకు నీరు విడుదలవుతున్న నేపథ్యంలో అధికారులు మరమ్మతులు చేపడుతున్నారు. రోప్స్ తెగిపోవడం వల్ల కౌంటర్‌వెయిట్ నీటిలో పడిపోయింది. దీంతో గేట్ నుంచి నిరంతరాయంగా నీరు వృథాగా గోదావరిలోకి వెళ్తుంది. అయితే ప్రాజెక్టులో క్రమంగా నీరు తగ్గడంతో అధికారులు సిబ్బంది, ఇతర కూలీల సహాయంతో వరదగేటుకు మరమ్మతులు చేపడుతున్నారు.

### ప్రాజెక్టునును సందర్శించిన అధికారులు

కడెం ప్రాజెక్టును శుక్రవారం గోదావరి రివర్ మేనేజేమెంట్ బోర్డు సెక్రటరీ వెంకటస్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈఈ విఠల్‌తో కలిసి పలు వరద గేట్లను, నీటి సామర్థ్యాన్ని అడిగి తెలుసుకు న్నారు. వరదగేట్ కౌంటర్‌వెయిట్ పడిపోవడం వల్ల నీరు తగ్గుతున్న తరుణంలో ప్రస్తుతానికి ప్రాజెక్టులో ఉన్న నీటి వివరాలు, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీటిని తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయకట్టు సామర్థ్యం, కాలు వల ద్వారా నీటి వివరాలను తెలుసుకున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో డీఈ బోజదాస్, ప్రాజెక్టు సిబ్బంది, తదితరులున్నారు.


కడెం ప్రాజెక్టు వద్ద అధికారులు